

శ్రీరాంపూర్ : ఎస్సార్పీ-3గనిపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి


నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

3 | మంగళవారం 24 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




రెబ్బెన : ఖైర్‌గూడ ఓసీపీలో కార్మికులకు నల్లబ్యాడ్జీలు పెడుతున్న టీబీజీకేఎస్ నాయకులు



శ్రీరాంపూర్ : ఆర్కే- 6గనిపై టీబీజీకేఎస్ నాయకుల ఆందోళన



మందమర్రి : కేకే -5గని పై నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు



తాండూర్: ఏరియా స్టోర్స్‌లో నిరసన తెలుపుతున్న మంగీలాల్, టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు

# నల్లనేలపై నిరసనల హోరు

## సింగరేణి లాభాల వాటాలో కోతపై టీబీజీకేఎస్ ఆగ్రహం

- గనులపై కార్మికులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో ఆందోళన
- కాంగ్రెస్ సర్కారు వైఖరిపై మండిపాటు
- న్యాయం చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామంటూ హెచ్చరిక



మందమర్రిలోని వర్క్‌షాప్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు



కాసిపేట : 2 ఇంక్లైన్‌పై నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 23 : సింగరేణి లాభాల వాటాలో కోత విధించిన కాంగ్రెస్ సర్కారుపై టీబీజీకేఎస్, కార్మిక లోకం కన్నెర్ర చేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం నల్లనేలపై నిరసనలతో హోరెత్తించింది. శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్‌లపై టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు చేపట్టారు. వాస్తవ లాభాల నుంచి రూ. 1550 కోట్ల వాటా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఎస్సార్పీ గనిపై ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర నాయకులు సాధుల భాస్కర్, తౌటి సురేశ్, వెంకట్‌రెడ్డి, గంగాధర్, సాల్మన్, సిరాజ్ పాషా, గోపీనాయక్, ఆర్కే-5 గనిపై ఇన్‌చార్జి దుర్గం రవి, జాడి శ్రీనివాస్, పాపిరెడ్డి, రమేశ్, ఆర్కే న్యూటెక్ గనిపై ఎండా లాలా, ఉప్పాల సంపత్, ఎస్సార్పీ-1గనిపై రవిచంద్ర, వికాస్, మెడం తిరుపతి, మారం శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఓసీపీపై ఇన్‌చార్జి గడ్డం సుధాకర్, సారయ్య, ఐకే-1పై రత్నాకర్‌రెడ్డి, రవీమదర్, సందీప్, ఆర్కే-6గనిపై కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, రమేశ్, గొర్ల సంతోష్, ఆర్కే-7గనిపై ఇన్‌చార్జి రాజునాయక్, బిరుదు శ్రీనివాస్, కార్మికులు ఆందోళన చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ 2023-24లో వచ్చిన రూ. 4701 కోట్ల లాభాల నుంచి 33 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నికర లాభాలు రూ. 4701 కోట్లు ప్రకటించి, కార్మికులకు 16.9 శాతం వాటా (రూ.796 కోట్లు) మాత్రమే ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, అధికార పార్టీ సంఘం ఐఎన్‌టీయూసీ పట్టనట్లు వ్యవహరించి కార్మికులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు.

తాండూర్, సెప్టెంబర్ 23 : తాండూర్‌లోని ఏరియా స్టోర్స్ వద్ద టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగీలాల్ నేతృత్వంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. లాభాల వాటాలో కార్మికులకు అన్యాయం జరిగిందని, 33 శాతం వాటా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేశ్, పిట్ సెక్రటరీ గణపతి పాల్గొన్నారు.

మందమర్రి, సెప్టెంబర్ 23: మందమర్రి ఏరియాలోని బొగ్గు బాయిలు, డిపార్ట్‌మెంట్లపై నాయకులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రాణాలకు తెగించి సింగరేణి ప్రగతికి పాటుపడుతున్న కార్మికులకు అన్యాయం చేయడం దారుణమన్నారు. ఇకనైనా సర్కారు పునరాలోచించాలని కోరారు. టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు జే.రవీందర్, కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపలి సంపత్, నాయకులు ఈశ్వర్, తోట రాజిరెడ్డి, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాసిపేట, సెప్టెంబర్ 23 : కాసిపేట 1వ గని, కాసిపేట-2 ఇంక్లైన్‌పై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కాసిపేట-2గనిపై అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సారంగపాణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పోరాడిన సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ సర్కారు మొండి చేయి చూపించడం దారుణమన్నారు. పోషం, వెంకటేశ్, యాదగిరి, కృష్ణ, వెంకటేశ్, ఉదయ్, తిరుపతి పాల్గొన్నారు.

బెల్లంపల్లి, సెప్టెంబర్ 23 : పట్టణంలోని శాంతిఖని గని ఆవరణలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటరమణ,సెంట్రల్ కమిటీ సభ్యుడు దాసరి శ్రీనివాస్, జీఎం కమిటీ సభ్యుడు రాజనాల రమేశ్, నాయకులు హన్మంతరావు, మల్లయ్య, రాజన్న పాల్గొన్నారు.

రెబ్బెన, సెప్టెంబర్ 23 : ఖైర్‌గూడ ఓసీపీలో టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కేంద్ర కమిటీ సభ్యులు గజెల్లి చంద్రశేఖర్, ఓరం కిరణ్ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ సర్కారు దిగి రాకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### ఆందోళనలు చేపడుతాం



మందమర్రి, సెప్టెంబర్ 23 : కార్మికుల కష్టంతో గతేడాది సింగరేణికి రూ. 4701 కోట్ల లాభాలు వచ్చాయి. అందులో కోత విధించి రూ. 796 కోట్ల వాటా మాత్రమే ఇస్తామని ప్రకటించడం దారుణం. ఈ విషయంలో కాం గ్రెస్ ప్రభుత్వం, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు మాకు అన్యాయం చేశాయి. ఇకనైనా వాస్తవ లాభాల వాటాను చెల్లించాలి. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతాం.

- ఎం.ఈశ్వర్, వర్క్‌షాప్ ఉద్యోగి, మందమర్రి

### అన్యాయం చేయడం సరికాదు



మందమర్రి, సెప్టెంబర్ 23: సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాల్లో 33 శాతం వాటా చెల్లించాలి. వాస్తవ లాభాలను ప్రకటించి సంస్థ అభివృద్ధి, నూతన ప్రాజెక్టుల ఏర్పాటు పేరిట లాభాల్లో కోత విధించి మాకు అన్యాయం చేయడం సరికాదు. గత ప్రభుత్వాలు ఇలా చేయలేదు. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు పునరాలోచించాలి. లేదంటే పోరాటం తప్పదు.

- కోరబోయిన లక్ష్మణ్, ఆర్కేపీ సీఎస్పీ, మందమర్రి



బాల్క సుమన్‌తో కలిసి కేటీఆర్‌ను కలిసిన నియోజకవర్గ నాయకుడు రమేశ్


# కార్యకర్తలకు మనోధైర్యాన్నివ్వాలి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చెన్నూర్, సెప్టెంబర్ 23: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు మనోధైర్యాన్ని ఇవ్వాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పార్టీ నేతలకు సూచించారు. సోమవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, చెన్నూర్ నియోజకవర్గ స్థాయి నాయకుడు రాజా రమేశ్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా చెన్నూర్ నియోజకవర్గంలో జరుగుతున్న ఘటనలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వివేక్ అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ శ్రేణులతో పాటు అధికారులను సైతం బెదిరిస్తున్నారని వివరించారు. బీఆర్ఎస్ నాయకులపై పెడుతున్న అక్రమ కేసుల గురించి ఆయనకు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేసిందని, హామీల అమలులో వైఫల్యం చెందిందనే విషయం ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి, నాయకులకు ఓటు రూపంలో ప్రజలే బుద్ధి చెబుతారని, అప్పటి వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోకుండా ఉండాలని కేటీఆర్ సూచించారు. మాజీ విప్ బాల్క సుమన్ రెండు మూడు రోజుల్లో జిల్లాకు వచ్చి ఇక్కడ జరుగుతున్న పరిణామాలపై నాయకులు, కార్యర్తలతో చర్చించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు వ్యూహాలను రచించనున్నారు.

# 70 మందికి నోటీసులు

భీమారం, సెప్టెంబర్ 23 : చెరువు శిఖంతో పాటు, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన 70 మందికి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఆర్ఐ స్రవంతి ఆధ్వర్యంలో మూడు టీమ్‌లుగా ఏర్పడి నోటీసులు అందించారు. సర్వే నంబర్ 570, 607,612,613,614,615లలోని ఎఫ్‌టీఎల్, శిఖం, ఆబాది భూముల్లో గతంలో గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు పొందిన భవనాలకు నోటీసులు జారీ చేశారు. అందుబాటులో లేని వారికి మంగళవారం నోటీసులు ఇవ్వనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కృష్ణ మూర్తి తెలిపారు.



నోటీసులు అందజేస్తున్న పంచాయతీ సిబ్బంది

# కుమ్మరికుంట శిఖం సర్వే షురూ

- కొన్నేళ్ల క్రితం పెద్ద సంఖ్యలో అక్రమ నిర్మాణాలు
- మొత్తం శిఖం 16.24 ఎకరాలకు.. ప్రస్తుతమున్నది నాలుగైదెకరాలే
- హద్దులు ఏర్పాటు చేయనున్న అధికారులు
- ఆందోళనలో నిర్మాణదారులు



సర్వే చేస్తున్నారని తెలుసుకొని చూసేందుకు వచ్చిన ప్రజలు



కుమ్మరి కుంట చెరువు



కుమ్మరి కుంట శిఖం భూమిని సర్వే చేస్తున్న అధికారులు

చెన్నూర్, సెప్టెంబర్ 23 : చెన్నూర్ పట్టణం నడిబొడ్డున ఉన్న కుమ్మరికుంట శిఖం భూమి నిర్ధారణ కోసం యంత్రాంగం సోమవారం సర్వే ప్రారంభించింది. చెరువు శిఖం సర్వే నంబర్ 971లో 16.24ఎకరాలు ఉండాల్సి ఉండగా, కొన్నేళ్లుగా ఆక్రమణకు గురికావడంతో విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఈ చెరువు శిఖం నుంచే పలు గ్రామాలకు వెళ్లేందుకు కొన్నేళ్లక్రితం ప్రధాన రహదారి ఏర్పాటు చేయగా, దానిని ఆనుకొని అనేక నిర్మాణాలు చేపట్టడంతో శిఖం కుదించుకపోయింది. ప్రస్తుతం నాలుగైదు ఎకరాలకే శిఖం భూమి పరమితమైంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు కుమ్మరికుంట శిఖం భూమిని గుర్తించేందుకు డిప్యూటీ తహసీల్దార్ సనత్‌కుమార్, సర్వేయర్ అశోక్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంజిత్, నీటిపారుదలశాఖ డీఈ వేణుగోపాల్, ఏఈఈ బీ తిరుపతి సంయుక్తంగా సోమవారం సర్వేను ప్రారంభించారు. ఈ మేరకు పట్టాదారులు డ్యాకుమెంట్లతో హాజరుకావాలంటూ ఈ నెల 20న రెవెన్యూ అధికారులు పలువురికి నోటీసులు జారీ చేశారు. మొదట సర్వే నంబర్ 971లో 16.24ఎకరాల శిఖం భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం నీటి పారుదలశాఖ అధికారులు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించి హద్దులు నిర్ణయించనున్నారు. ఈ సర్వే ప్రక్రియ పూర్తి కావడానికి మూడు రోజులు పడుతుందని, ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

### కొన్నేళ్లుగా ఆక్రమణ

చెరువు శిఖంపై కొందరికి పట్టా భూములుండగా, కొన్నేళ్ల క్రితం ఇంటి స్థలాలుగా చేసి విక్రయించారు. అయితే అప్పట్లో శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లాంటి విషయాలను ఇటు అధికారులు.. అటు కొనుగోలుదారులుకాని పట్టించుకోలేదు. అప్పట్లో ఈ స్థలాల్లో ఇంటి నిర్మాణాలకు అనుమతులు కూడా ఇచ్చారు. ఇలా శిఖంతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో వందల సంఖ్యలో బహుళ అంతస్తులు ఏర్పడ్డాయి. చెరువును ఆనుకొని ఉన్న ప్రధాన రహదారికి ఓ వైపు వాణిజ్య సముదాయలతో పాటు నివాస గృహాల నిర్మాణాలు జరిగాయి.

### భయాందోళనలో నిర్మాణదారులు

ప్రస్తుతం కుమ్మరికుంట చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులను నిర్ధారించేందుకు అధికారులు సర్వే చేస్తుండగా, అందులో నిర్మాణాలు చేపట్టిన వారంతా భయాందోళనలకు గురవుతున్నారు. ఈ హద్దులు ఎక్కడి వరకు వస్తాయో? తమ ఇండ్లు వాటి పరిధిలో ఉన్నాయేమోనని ఆందోళన చెందుతున్నారు. కాగా, సర్వే విష యం తెలుసుకొని పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చా రు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### సంయుక్తంగా సర్వే

చెన్నూర్, సెప్టెంబర్ 23 : పట్టణంలోని కుమ్మరికుంట చెరువును సంబంధిత శాఖల అధికారులతో సంయుక్తంగా సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వానకాలంలో చెరువు నిండి సమీపంలోని వార్డుల్లోకి వరద రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నీటి పారుదలశాఖ, రెవెన్యూశాఖల సమన్వయంతో సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ జోన్ పరిధిపై విచారణ చేపట్టి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

# 'పీఎం విశ్వకర్మ'ను పకడ్బందీగా అమలు చేయాలి

### ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 23 : ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పీఎం విశ్వకర్మ పథకంపై అధికారులు, అమలు కమిటీ సభ్యులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులవృత్తిదారుల సంక్షేమం కోసం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ప్రారంభించారని, టైలరింగ్, బార్బర్, భవన నిర్మాణ మేస్త్రీలుగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కిట్లు అందించడంతో పాటు బ్యాంకు రుణ సదుపాయం కల్పించేలా కృషి చేయాలన్నారు. శిక్షణ సమయంలో స్టయిఫండ్ అందేలా చూడాలన్నారు. జిల్లాలో 2, 196 దరఖాస్తులు రాగా, మొదటి దశలో గ్రామపంచాయతీల పరిధిలో 992 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, రెండో దశలో 864 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, మూడో దశలో 447 దరఖాస్తుల మంజూరుకు సిఫారసు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అశోక్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి లక్ష్మీనారాయణ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, అధికారి ప్రశాంత్, అమలు కమిటీ సభ్యులు శ్రీశైలం, మురళీ పాల్గొన్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679